మధూహ పిడికిళ్ళు బిగుసుకున్నాయి. మనిషి నిలువెల్లా కంపించిపోయింది.

దేశంకానిదేశంలో స్థిరపడి....ఎంతో కష్టంతో జీవితాంతం రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టిన ఆ కాస్త భూమినీ...ఒక బీదరైతు అంత అమాయకత్వంతో అమ్మేస్తే...ఆ తప్పెవరిది? మోసం చేసేవాడి తెలివిదా? మోసపోయేవాడి మూర్ఖత్వానిదా?

సరిగ్గా పది నిముషాల తరువాత ఆమె రాజు క్లినిక్‌కి ప్రవేశించింది. గాలిలా వచ్చిన ఆమెనీ, ఆమె ఆకారాన్నీ చూసి రాజు ఆశ్చర్యపోయాడు.

ఆమె లోపలికి వెళ్ళేసరికి రాజు ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

ఆ వ్యక్తి నల్లగా, మొహంమీద స్ఫోటకం మచ్చలతో, లావుగా...వికృతంగా వున్నాడు.

తలుపుకూడా కొట్టకుండా సరాసరి లోపలికి వచ్చేసిన మధూహని చూసి రాజు మొహం చిట్లించాడు.

మధూహ వచ్చిన తీరు చూసి స్ఫోటకం మనిషి కుర్చీలోంచి లేచి "తరువాత కలుస్తాను" అంటూ అక్కడనుంచి కదలబోయాడు.

"అదేమిటి? మీరు..." అంటూ రాజు ఏదో చెప్పబోతూంటే ఆ వ్యక్తి "మీరు మాట్లాడుకోండి...." అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

అంత ఆవేశంలో కూడా మధూహ అతడిని గమనించి ఆశ్చర్యపడింది. నాలుగు అడుగులకన్నా ఎక్కువ లేడు అతడు. దానికి తోడు లావుగా వున్నాడు. వెయ్యిమందిలో వున్నా స్పష్టంగా గుర్తు పట్టగలిగేట్టు వుందా బంతిలాంటి ఆకారం. దేవుడు అన్ని వైకల్యాలూ అతడికే ఇచ్చినట్టూ మొహంమీద స్ఫోటకం మచ్చలు. పైగా నలుపు.

ఇవన్నీ చూస్తే అతడి మీద జాలి వెయ్యాలి. లేదా అతడి ఆకారాన్ని చూసి నవ్వు రావాలి. కానీ ఆమెకు కలుగలేదు. భయం వేసింది. అవును  భ...యం....

అతడి కళ్ళల్లో అదోలాటి క్రూరత్వం వుంది. పైకి మామూలుగానే వున్నాయి గానీ, ఎందుకో తరచిచూస్తే అవి మామూలు కళ్ళులాగా కనపడవు.

అతడు కూడా మైండ్ మాగ్నెట్ పెట్టుకుని తన మొహాన్ని అందంగా మార్చుకోవటం కోసం వచ్చాడేమో అనుకుంది. ఇంతలో రాజు "ఏమిటిలా చెప్పాపెట్టకుండా వచ్చావ్?" అని అడగటంతో ఆలోచన్ల నుంచి తేరుకుని "నీతో మాట్లాడటానికి " అంది.

ఆమెలో పూర్వపు ఆవేశమూ, కోపమూ చోటు చేసుకున్నాయి.

రాజు విసుగ్గా "దానికి సాయంత్రం కలిసినప్పుడు బోలెడు టైముంటుందిగా. అంత అర్జెంటేముంది?" అన్నాడు.

"నీకర్జెంటు కాకపోవచ్చు. కానీ మాలాటి వాళ్ళకి జీవన్మరణ సమస్య...." సూటిగా అంది.

ఆ మాటలకి రాజు ఆమెవైపు అదోలా చూసి, "ఏమిటి? ఏదో నాటకంలోలా మాట్లాడుతున్నావ్?" అని అడిగాడు.

"నువ్వాడే నాటకాన్ని చూస్తూ ఇక సహించలేక..."

రాజు తెల్లబోయినట్టు కనిపించాడు. "నేనాడే నాటకమా? ఏమిటది?"

"బ్లడ్ కాన్సర్‌ని తగ్గిస్తాననే నాటకం"

అప్పటికి విషయం అర్థమైంది అతడికి "నువ్వు చెప్పేది మీ మామయ్య సంగతా?"అన్నాడు.

"మా మామయ్యలాటి వేలాదిమంది అమాయకుల సంగతి..."

రాజు అనునయంగా అన్నాడు... "చూడు మధూ. మేమొక థియరీ నమ్ముతున్నాం. ప్రతీ రుగ్మతా మెదడు మీదా, మనోశక్తి మీదా ఆధారపడి

వుంటుందన్న థియరీ! అది కరెక్టవుతే కేన్సర్‌ని కూడా వశీకరణ శక్తిద్వారా నయం చెయ్యవచ్చు. ఈ వాదనలో అబద్ధమేముంది?".

"వాదనలో అబద్ధం లేదు. కానీ ఈ ప్రాక్టీసులోనే తప్పుంది. ఈ వాదనని మీలాటి మేధావులందరూ కలిసి చాలా జాగ్రత్తగా నిర్మించుకున్నారు. నీకు దేవుడు అద్భుతమైన తెలివితేటలు ఇచ్చాడు రాజూ! ఏ విషయాన్నైనా నీకు కన్వీనియెంట్‌గా మార్చుకుని వాదించగలవు. వందలమంది మానసిక రోగుల్తో మాట్లాడి మాట్లాడి బహుశా నీకీ కళ అబ్బివుంటుంది. ఆ వాదనని దయచేసి నామీద ప్రయోగించకు " కసిగా అంది.

"నేను అనుకున్నది చెప్పాను. ఇక నీ ఇష్టం" క్లుప్తంగా అన్నాడు.

"ఏమిటి నువ్వు అనుకున్నది. వశీకరణ శక్తిద్వారా అన్ని రుగ్మతల్నీ నయం చేయవచ్చుననే థియరీ కరెక్టవుతే కేన్సర్‌ని కూడా నయం చేయవచ్చునని! అంతేగా."

"అంతే"

"ఆ థియరీ కరెక్టు కాకపోతే ఏ చిన్న రోగాన్నీ నయం చేయలేవు అంతేగా....".

"అంతే " అనబోయి ఆగి, ఏదో అర్థమై దెబ్బతిన్నట్టు చూశాడు. ఇటీవలి కాలంలో అదే మొట్టమొదటిసారి అతను అలా దెబ్బతినటం....! అయితే వ్యవహార జ్ఞానం వున్నవాడవటంచేత, వెంటనే తేరుకుని మొహంమీద నవ్వు తెచ్చుకుని "....ఏ విషయాన్నయినా అనుగుణంగా మార్చి వాదించే తెలివితేటలు దేవుడు నాక్కాదు మధూ! నీకిచ్చాడు" అన్నాడు నవ్వుతూ.

"నా ప్రశ్నకి సమాధానం అది కాదు"

"దేనికయినా ప్రయత్నం అవసరం. ప్రయత్నించటంలో తప్పు లేదుగా...".

“ ఆ ప్రయత్నానికి అయ్యే ఖర్చుని ఒక బీదరైతు మీద వేయటమే తప్పు. నీకు పాతికవేలు ఇవ్వటం  కోసం మా మామయ్య తన సర్వస్వం అమ్ముకున్నాడు తెలుసా?”.

“అంత ఖర్చు అవుతుందని అతడికి నేను చెప్పాను. అన్నీ వివరించాను కూడా”.

“అన్నీ వివరిస్తావు. నీ తప్పు ఎక్కడా లేకుండా జాగ్రత్త పడతావు. ఎవరైనా పేషెంట్ ‘నత్తి తగ్గలేదేమంటే .... నీకు సెల్ఫ్ కంట్రోలు లేదంటావు. ఆ సెల్ఫ్ కంట్రోలేగానీ పేషెంట్‌కుంటే నీ దగ్గరకెందుకు వస్తాడని ఎవరూ అడగరు. అంతేగా”.

రాజు మొహం ఎర్రబడింది. కష్టంమ్మీద తనని తాను సంభాళించుకుంటూ “నువ్వు అనవసరంగా అప్‌సెట్ అవుతున్నావు మధూ! మీ మామయ్య ఎటూ తోచని పరిస్థితుల్లో నాదగ్గరికి వచ్చాడు. అటువంటివాడికి నాకు చేతనైనంతలో కొద్దిగా ఆశారేఖ చూపించటంలో తప్పు లేదు. దానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను”అన్నాడు.

“నువ్వు ప్రయత్నించడం లేదు రాజూ! ఎందుకంటే ప్రతి ప్రయత్నంలోనూ ఓటమికీ విజయానికీ ఫిఫ్టీ...ఫిఫ్టీ ఛాన్స్ వుంటుంది. కానీ నీ ప్రయత్నంలో  అసలు విజయానికి ఛాన్సే లేదు. ఎటూ తోచని పరిస్థితుల్లో... అన్నావే. చాలా కరెక్టయిన మాట అది! రాత్రిళ్ళు నిద్ర పట్టని వాళ్ళు, డిప్రెషన్‌కి గురి అయినవాళ్ళూ, మానసిక సమస్యల్తో బాధపడేవాళ్ళూ, కేన్సర్ పేషెంట్లూ, జ్ఞాపకశక్తి లేక కృంగిపోతున్న వాళ్ళూ... వీరందరి రోగాలకీ సరి అయిన మందులు  లేవు. లేవని నీకూ తెలుసు. డాక్టర్లందరూ. వీరికి చికిత్స నూరుశాతం కష్టమని నిజాయితీగా చెబుతారు. పేషెంట్ నిరాశలో కూరుకుపోతాడు. ఏ చిన్న ఆధారం దొరికినా పట్టుకుందామని ఆశగా చూస్తుంటాడు. అప్పుడు రంగంలోకి మీరు ప్రవేశిస్తారు. మీ వాక్చాతుర్యంతో, ప్రకటనలతో వారిని ఆకట్టుకుంటారు. ‘ఈ  ప్రయత్నం కూడా చేసి చూస్తే తప్పేముంది?’ అన్న భావాన్ని వారిలో కలిగిస్తారు. నిరాశతో కృంగిపోతున్న మనిషి దేవుళ్ళకి మొక్కుకునేది అందుకే. బాబాల్నీ వాస్తు శాస్త్రజ్ఞుల్నీ ఆశ్రయించేది అందుకే. బాధతో విలవిలలాడిపోతున్నవాడు తమ బాధని అర్ధంచేసుకుని దానికి ఎవరైనా పరిష్కారం చూపుతానంటే అలాటి పరిష్కారాలకోసం ఎంతైనా

ఇచ్చుకుంటాడు. మా మామయ్య పరిస్థితీ అదే... అందుకే భార్య కోసం వున్నదంతా అమ్మేశాడు".

"నువ్వు చెప్పిందంతా నిజమైతే ప్రజలు ఎప్పుడో తిరగబడి వుండేవారు. పోలీసులు అరెస్టు చేసి వుండేవారు. నా ప్రాక్టీను ఇలా వుండేది కాదు. ప్రజలు సంతృప్తులవుతున్నారు. కాబట్టే ఇదంతా జరుగుతోంది".

"అబద్ధం" అరిచింది మధూహ "నీ పేషెంట్లలో ఒక్కరు...కనీసం ఒక్కరు బాగుపడ్డారని నిరూపించు చూద్దాం! ఎవరికివారు, తామొక్కరిదే నయం కాని జబ్బు అనుకుని వెళ్ళిపోతున్నారు. తమ ఫ్రిజిడిటీ తగ్గకపోతే, తమలోనే ఏదో లోపం వుందనుకుంటున్నారు. తాము సిగరెట్టు మానలేకపోతే, తమకే కంట్రోలు లేదనుకుంటున్నారు. తమ మెదడు నీ వశీకరణ శక్తికి లోబడటం లేదని తృప్తి చెందుతున్నారు".

"నా హిప్నాటిక్ శక్తికి లోబడని వారు ఎవరూ లేరు..."

"అది నీశక్తి కాదు నీ క్లోరోఫాం శక్తి"

రాజు దిగ్భ్రాంతుడై చూశాడు.

అతడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. క్రమక్రమంగా వాటి రూపు మారింది.

అంత వికృతంగా వుండటం ఆమె  ఎప్పుడూ చూడలేదు. మనుష్యులసలు అంత కుత్సితత్వాన్ని మనస్సులో దాచుకుని పైకి మామూలుగా కనపడగలరని ఆమె ఊహించలేదు.

అందునా అతడు తన స్నేహితుడు!

త్వరలో వివాహం చేసుకోబోయేవాడు. ఆమె అతడిలో మార్పుని నిశ్చేష్టురాలిలా చూసింది.

అతడి పెదవులమీద వంకర నవ్వు  వెలిసింది.

"...చాలా రహస్యాలు తెలుసుకున్నావే" అన్నాడు.

ఆమె కూడా వెనక్కి తగ్గదల్చుకోలేదు "అవును తెలుసుకున్నాను అందుకే నీక్కాబోయే భార్యగా ఇవన్నీ ఆపమని అర్థిస్తున్నాను" అంది.

"ఆపకపోతే?" తాపీగా అన్నాడు.

ఆమె నిరత్తురాలై చూసింది. అతడు గర్వంగా అన్నాడు.

"నేను నాకున్న విద్యతో డబ్బు సంపాదించదల్చుకున్నాను. నన్ను నమ్మిన వాళ్ళు నాదగ్గరి కొచ్చి ఫీజు ఇస్తున్నారు. ఇందులో మోసం ఏమీ లేదు. నా విద్య...."

"విద్య...విద్య...విద్య...." ఆమె అరిచింది. "ఏమిటి నీ విద్య? నీకంత విద్యే వుంటే నీ చెల్లెళ్ళిద్దరూ ఏడోక్లాసు ఎందుకు ఫెయిలవుతారు? వారి జ్ఞాపకశక్తిని ఎందుకు పెంచలేకపోయావన్న అనుమానం నీ పేషెంట్లలో ఒక్కరికీ రాలేదా?".

ఆతడు నవ్వి "రాలేదు" అన్నాడు.

"నన్ను నీ వశీకరణశక్తితో అయిదేళ్ళ వెనక్కి తీసుకెళ్ళు. మన మొదటి పరిచయంనాడు ఏమి మాట్లాడుకున్నామో చెప్పించగలవా?".

"చెప్పించలేను"

"నీ థెరపీ ద్వారా నీ తండ్రి చుట్ట అలవాటు ఎందుకు మాన్పించలేదు?".

"మానటం ఆయన కిష్టం లేదు" అంటూ అతడు కుర్చీలోంచి లేచి ఆమె దగ్గరగా వచ్చాడు. "చూడు మధూ! అసలు విషయం చెప్తాను విను. డాక్టరు విశాల్ మైండ్ హిప్నో మాగ్నో క్లినిక్‌ని నీలాటి వాళ్ళు వెయ్యిమంది కలిసినా ఏమీ చేయలేరు. మనకు తెలివితేటలు లేనప్పుడు, తెలివైన వాడితో కలిసి వ్యాపారం చేయటం మంచి పద్ధతి. నువ్వన్నట్టు ప్రజలు మూర్ఖులు. తాము కష్టంలోంచి బయటపడటానికి ఏ చిన్న

ఆధారం దొరుకుతుందా అని చూస్తుంటారు. ఈ బలహీనతని క్యాష్ చేసుకోవటం అన్నది అన్ని రంగాల్లోనూ వున్నదే. దీని గురించి అనవసరంగా మనసు పాడు చేసుకోకు. వచ్చే ఏడాదికల్లా నేను కారు కొంటాను. నా భార్యగా నీకు అన్ని సౌఖ్యాలూ లభిస్తాయి."

"వొద్దు రాజూ! ఇంతమంది అమాయకుల ఉసురుతో సంపాదించిన ఆ డబ్బు మనకి ఏ సౌఖ్యాన్నీ ఇవ్వదు. ఆ ఆలోచన మానుకో".

"ఏ ఆలోచన? క్లినిక్ మూసేయటమన్న ఆలోచనా? నీతో జీవితం పంచుకోవటమన్న ఆలోచనా?".

అతడు చాలా తాపీగా అన్న ఆ మాటలకి ఆమె బాంబు పడ్డట్టు అదిరిపడింది. ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్టుగా అనిపించింది.

ఈ లోపులో అతనన్నాడు "నువ్వూ నేనూ ఒకప్పుడు సాధారణమైన మనుష్యులం. నీ కళ్ళముందే నేను ఎదిగిపోయాను. నాతోపాటూ నిన్నూ పైకి లాగుదామనుకున్నాను. కానీ నువ్వు...? చేతకాని వాళ్ళందరూ చెప్పే నైతిక సిద్ధాంతాల్నే చెపుతున్నావు. నీకు హాయిగా బ్రతకటం చేతకాదు. నిన్ను ప్రేమించాను కాబట్టి మాటమీద నిలబడి నీతో కలిసి జీవించాలనుకున్నాను. కానీ నీకు నామీద గౌరవం లేదు. ఏడాది తిరిగేసరికల్లా నాచుట్టూ ఎంతమంది అమ్మాయిలు క్యూలో నిలబడతారో చూడు. నేన్నీకు అంతగా నచ్చకపోతే నిరభ్యంతరంగా నన్ను వదిలేయొచ్చు. ఒక విధంగా అది మనిద్దరికీ మేలు..."

ఆమె నోట మాట రానట్టు అలాగే వుండిపోయింది.

అతనన్నాడు "ఈ విషయమై గత కొద్దిరోజులుగా నేను ఆలోచిస్తూనే వున్నాను. నామీద గౌరవం లేని నిన్ను ఎందుకు ప్రేమించాలి? నీ కోసం ఎందుకు మారాలి?".

ఒక నిర్ణయానికి వచ్చిందామె.

అతడేం చెప్పదల్చుకున్నాడో ఆమెకు పూర్తిగా అర్థమైపోయింది. నవ్వింది "....నీ అద్భుతమైన వాదనాపటిమని నా మీద ప్రయోగించకు రాజూ. నాకు తెలిసిందిలే! ఇప్పుడు నీ ఆర్థికస్టేటస్ వేరు. నీకు నాకన్నా అందమైన, డబ్బున్న అమ్మాయిలు దొరుకుతారు. నన్ను వదిలించుకోవాలన్న ఆలోచన నీకు ఎప్పట్నుంచో వుంది. ఇప్పుడా అవకాశం దొరికింది. కానీ ఒక్క విషయం జాగ్రత్త. పెళ్ళికూతురుగా నీ దగ్గరకొచ్చే పేషెంట్లని మాత్రం ఎన్నుకోకు. వారు మానసిక రోగగ్రస్తులయి వుండే ప్రమాదం వుంది."

అతడి మొహం ఎర్రగా మారింది "నీ సలహాకి థాంక్స్...." అన్నాడు ఇక నువ్వెళ్ళొచ్చు అన్నట్టుగా.

ఆమె వెళ్ళబోయి ఆగింది.. "అయిదు సంవత్సరాలు ప్రేమించుకున్న వారు కూడా విడిపోవాల్సి వచ్చినప్పుడు ఇంత నిర్ధాక్షిణ్యంగా ఒకరిమీద ఒకరు నెపం వేసుకుంటారన్నది చూస్తుంటే... నాకు ప్రేమ మీదే నమ్మకం పోతోంది".

"నెపం వేసింది నేను కాదు. నువ్వు"

"ఒకరోజు నువ్వు చేస్తున్న పనికి తప్పక పశ్చాత్తాపపడతావ్ రాజూ!".

"ఫారిన్‌కారులో నా భార్యతో నీ కళ్ళముందే తిరిగినప్పుడు పశ్చాత్తాపపడేదెవరో తెలుస్తుందిలే."

"వెళ్ళొస్తాను రాజూ. అయిదు సంవత్సరాలు స్నేహితురాలిగా ప్రేమని పంచినందుకు థాంక్స్".

"సేమ్ టు యూ. గుడ్ బై అండ్ గుడ్ బై ఫరెవర్...." అన్నాడు రాజు.

అశృపూరితమైన కళ్ళని అతడు చూడకుండా ఆమె కదిలి, నెమ్మదిగా బయటకు వెళ్ళిపోయింది. వెళ్ళబోతూ ఒక మాట మాత్రం అనుకుంది "ఇదంతా వేదన కలిగిస్తే కలిగించవచ్చుగాక! ఈ నిర్ణయానికి మాత్రం నేను ఎన్నడూ బాధపడను..."

ఆమె వెళ్ళాక ఆ గదిలోకి తిరిగి స్ఫోటకం మచ్చల వ్యక్తి ప్రవేశించాడు. సంభాషణ అంతా విన్నట్టు అతడి మొహమే చెబుతోంది.

"గుడ్, మిస్టర్ రాజూ. మంచి నిర్ణయం తీసుకున్నావ్. ఈ అమ్మాయి ముందునుంచీ నాకెందుకో 'డేంజర్ ' గానే తోచింది. ఇంతకన్నా మంచివాళ్ళు నీకు లక్షలమంది దొరుకుతారు" అన్నాడు.

"థాంక్యూ డాక్టర్ విశాల్" అన్నాడు రాజు.